క్లుప్తంగా

మహిళా పీజీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా మధుశ్రీ



కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ మహిళా పీజీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా ఆ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.మధుశ్రీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తించిన గణిత విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య నుంచి మధుశ్రీ బాధ్యతలు స్వీకరించారు.

బియ్యం పంపిణీ గడువు నేటితో ఆఖరు

కాజీపేట: రేషన్ దుకాణాల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేసే బియ్యం గడువు శుక్రవారం ముగుస్తుంది. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరిగిన నేపథ్యంలో రెండు రోజుల పాటు పొడిగిస్తూ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇక నుంచి ప్రతినెలా ఒకటి నుంచి 15వ తేదీ వరకు బియ్యం పంపిణీ ఉంటుందనే విషయాన్ని వినియోగదారులు గమనించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 13మందికి జరిమానా

రామన్నపేట: మద్యం తాగి వాహనాలు నడుపుతూ తనిఖీల్లో పట్టుబడిన 13 మంది వాహనదారులకు కోర్టు గురువారం 13,900 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ శ్రీధర్ తెలిపారు. బైక్‌లకు భారీ శబ్దాలు వెలువడే సైలెన్సర్లను ఉపయోగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

అర్హులనే వర్సిటీ వీసీలుగా నియమించాలి

హన్మకొండ: అనుభవం, అర్హత, సమర్థత ఉన్న వారిని రాష్ట్రంలోని పది విశ్వవిద్యాలయాలకు ఉప కులపతులుగా నియమించాలని ప్రభుత్వానికి ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు విజ్ఞప్తి చేశారు. మే 21వ తేదీతో ప్రస్తుత ఉపకులపతుల పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో కొత్త ఉపకులపతులను నియమించుకోవడానికి ఎన్నికల కమిషన్ అనుమతి ఇచ్చిన క్రమంలో విధేయులను కాకుండా విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయగల సామర్థ్యం కలిగిన విద్యార్థులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించగల దక్షతగల వారిని నియమించాలని శేషు ఒక ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వం తమ అనుయాయులు, విధేయులను ఉపకులపతులుగా నియమించడంతో విశ్వవిద్యాలయాలు నిర్వీర్యమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న 312 మందిలో అన్ని అర్హతలు ఉన్న వారినే ఎంపిక చేయాలని కోరారు.

వీధి కుక్కల పట్టివేత



ఖిలా వరంగల్: వరంగల్ కరీమాబాద్ 40వ డివిజన్‌లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. పగలు, రాత్రి కాలనీల్లో తిష్టవేసి ప్రజలను వెంటబడి దాడి చేస్తున్నాయి. దాంతో అనేక మంది గాయాల పాలయ్యారు. స్థానికుల అభ్యర్థన మేరకు స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవి స్పందించి బల్దియా అధికారులకు సమాచారం ఇచ్చారు. దాంతో వారు స్పందించి వీధి కుక్కల పట్టివేత కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టుకున్న కుక్కలను నగరానికి దూరంగా బల్దియా ఏర్పాటు చేసిన కుక్కల సంరక్షణ కేంద్రానికి సిబ్బంది తరలించారు.

హక్కుల కోసం పోరాడుదాం



వరంగల్ చౌరస్తా: ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ ఉద్యోగుల హక్కుల కోసం సమన్వయంతో పోరాడుదామని వరంగల్ జిల్లా అధ్యక్షుడు తుమ్మ వీరయ్య అన్నారు. వరంగల్ కాశిబుగ్గ వివేకానంద కళాశాలలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని ప్రయోజనాలను రాబట్టుకునేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కడియంను కలిసిన కాంగ్రెస్ నాయకులు

మడికొండ: ఎమ్మెల్యే కడియం శ్రీహరిని హనుమకొండ కనకదుర్గ కాలనీలోని ఆయన నివాసంలో 46వ డివిజన్ పరిధిలోని కాంగ్రెస్ మడికొండ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికల్లో కడియం కావ్య కోసం కృషి చేసిన ప్రతీ కార్యకర్తకు కడియం శ్రీహరి ధన్యవాదాలు తెలిపారు.

వాగును తోడేస్తున్నారు

- యథేచ్ఛగా ఇసుక అక్రమ తరలింపు
- చోద్యం చూస్తున్న అధికారులు

హసన్‌పర్తి: మండలంలోని మడిపల్లి, అన్నాసాగరంలో ఇసుక అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. అనుమతులు లేకుండానే అధికారుల అండదండలతోనే ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. ఇసుక మాఫియా పట్టపగలే వాగును తోడేస్తోంది. రాజకీయ పలుకుబడితో ఈ వ్యాపారం సాగుతున్నట్లు విమర్శలున్నాయి.

వివరాల్లోకి వెళ్లితే.. ధర్మసాగర్ నుంచి ఉనికిచర్ల, మడిపల్లి, అన్నాసాగరం వయా ఎల్కతుర్తి మీదుగా వాగు ప్రవహిస్తోంది. ముఖ్యంగా మడిపల్లి ప్రాంతంలో ఈ వాగును ఎక్కువగా లూటీ చేస్తున్నారు. ఈ వాగు ఇసుక హసన్‌పర్తి మండలంలోని చుట్టుపక్కల గ్రామాలతో పాటు నగరానికి భారీగా తరలివెళ్తోంది. ఒక్కో ట్రాక్టర్ ఇసుకను రూ.4,500 నుంచి రూ.5 వేల వరకు విక్రయిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.



ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ (ఫైల్)

ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు

వాగు నుంచి ఇసుక అక్రమ వ్యాపారం చేయొద్దని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. ఇసుకను అక్రమంగా తరలించినట్లయితే వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేయాలని ఆదేశాలు ఉన్నాయి. అయితే, మడిపల్లి, అన్నాసాగరంలలో యథేచ్ఛగా ఇసుక అక్రమ దందా సాగుతున్నప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనే పలు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.



మడిపల్లి వాగు



ట్రాక్టర్ డ్రైవర్ల మధ్య గొడవ

ఇటీవల వాగు నుంచి ఇసుక తోడేటప్పుడు ట్రాక్టర్ డ్రైవర్ల మధ్య గొడవ జరిగింది. ఈ గొడవ కాస్త పోలీస్‌స్టేషన్ వరకు చేరినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే పెద్ద సమక్షంలో సయోధ్య కుదిరినట్లు తెలుస్తోంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ / ఖిలా వరంగల్ : వరంగల్ మహానగరంలోని పలు ప్రాంతాల్లో ఈనెల 17న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి, వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. హనుమకొండలోని భవానీనగర్, హౌజింగ్ బోర్డు కాలనీ, ఇందిరానగర్, ఎన్జీవోస్ కాలనీ రోడ్, సర్క్యూట్ హౌజ్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8నుంచి 11 గంటల వరకు, బొక్కలగడ్డ శ్రీనగర్ కాలనీ, పోచమ్మకుంట, కమ్మరివాడ, సరస్వతి నగర్, సమ్మయ్యనగర్, కుడా కాలనీ, శంకర్‌నగర్, ఆదర్శకాలనీ, బ్రాహ్మణవాడ, ప్రశాంతి హాస్పిటల్, నాగుల వీధి, ఇమ్లీపుర, పింజర్ల, టీచర్స్ కాలనీ, బ్యాంక్ కాలనీ, కాజీపేటలోని చైతన్యపురి కాలనీ, విష్ణుపురి, సోమిడి, మార్కెట్, సెయింట్ ఆన్స్ స్కూల్, శివారు ప్రాంతాలైన అయోధ్యపురం, బోడగుట్టు, భట్టుపల్లి, కొత్తపల్లి, అమ్మవారిపేట ప్రాంతాల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మడికొండ ఇండస్ట్రియల్ ఏరియా, రాంపూర్ ప్రాంతాల్లో ఉదయం 8నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు. వరంగల్ టౌన్ డివిజన్ పరిధిలోని శంభునిపేట మై మాస్టర్ స్కూల్, దూపకుంట, వస్తాపూర్, కరీమాబాద్, లక్ష్మీనగర్, దేశాయిపేట, బాలాజీనగర్ కూడలి, వీకర్స్ కాలనీ, మొగిలిచర్ల, మట్వాడ, డీఎస్ టెంపుల్, జీఎస్‌టెంపుల్, కాశిబుగ్గ, సాగర్ హోటల్, జీఆర్‌గుట్ట, గ్రెయిన్ మార్కెట్, జేపీఎన్ రోడ్డు, మండిబజార్, చార్‌బౌలి ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వారు వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు.

మారోజు వీరన్న సిద్ధాంతంతోనే సమసమాజ స్థాపన

హన్మకొండ: మార్క్స్ కోరుకున్న వర్గ నిర్మూలన, అంబేడ్కర్ ఆకాంక్షించిన కుల నిర్మూలనను తన సిద్ధాంతంగా నిర్ణయించుకొని కుల, వర్గ జమిలి పోరాటం చేసిన కామ్రేడ్ మారోజు వీరన్న సిద్ధాంతం ద్వారానే సమసమాజ స్థాపన సాధ్యమవుతుందని ద్రావిడ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, న్యాయవాది పూసాల శ్రీకాంతాచారి అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని వివేకానంద పాఠశాలలో న్యాయవాది బండి మొగిలి అధ్యక్షతన వీరన్న 25వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ముందుగా మారోజు వీరన్న చిత్రపటానికి ప్రజా సంఘాల నాయకులు, న్యాయవాదులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీకాంతాచారి మాట్లాడుతూ 1999, మే 16 బూటకపు ఎన్‌కౌంటర్‌లో వీరన్నను కాల్చి చంపారని, అయినా ఆయన సిద్ధాంతం తెలంగాణ సమాజంలో అనేక రూపాల్లో పని చేస్తోందన్నారు. వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్ గౌడ్ మాట్లాడుతూ ఎంతో మంది విప్లవకారులు అసువులు బాస్తున్న స్థితిపై మారోజు వీరన్న లేవనెత్తిన కుల, వర్గ జమిలి పోరాట సిద్ధాంతం విప్లవ పార్టీల్లోనే కాకుండా దేశ వ్యాప్తంగా చర్చకు వచ్చిందని వివరించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కొంగ వీరస్వామి, ఎంసీపీఐ నాయకులు గోనె కుమారస్వామి, మాస్ సావిత్రి, నాయకులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సంఘాలు, పార్టీల నాయకులు

సమష్టి కృషితో డెంగీ నివారణ

గీసుకొండ: సంబంధిత శాఖల సమన్వయం, సమష్టి కృషితో డెంగీ వ్యాధిని నివారించాలని వరంగల్ డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా వైద్యులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది 'సమాజంతో భాగస్వామ్యమై, డెంగీ వ్యాధిని నివారించుకుందాం' అనే నినాదంతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధార్‌సింగ్ మాట్లాడుతూ.. పట్టణ, గ్రామీణ ప్రాంతాలు అనే తేడా లేకుండా డెంగీ వ్యాధి వ్యాపిస్తుందని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటిస్తూ దోమల లార్వాల స్థావరాలను గుర్తించి నిర్మూలించాలన్నారు. డెంగీ నిర్ధారిత ప్రాంతాల్లో యాంటీ లార్వా, దోమల నివారణ మందులను పిచికారీ చేయిస్తామన్నారు. సమావేశంలో ఎన్సీడీ స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సత్యేంద్రనాథ్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ గోపాల్‌రావు, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, వైద్య సిబ్బంది సోమేశ్వర్, కిరణ్, ప్రకాశ్‌రెడ్డి, కుమారస్వామి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ వెంకటరమణ

దరఖాస్తుల ఆహ్వానం

కాశీబుగ్గ సెంటర్ : ఆపదలో ఉన్న బాలబాలికలను రక్షించిన బాలలు, స్వచ్ఛంద సంస్థల బాధ్యుల నుంచి ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుల కోసం జూలై 31తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని వరంగల్ జిల్లా సంక్షేమ అధికారి హైమావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన ఆవిష్కరణలు, అసాధారణ ప్రతిభాపాటవాలు, ఆటలు, కళలు, సాహిత్యం, సామాజిక సేవ, ధైర్య సాహసాలు తదితర అంశాల్లో ఈ అవార్డులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవార్డుల కోసం 5నుంచి 18 ఏళ్లలోపు బాలబాలికలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. స్వచ్ఛంద సంస్థలైతే ఏడేళ్లు ఆపైన బాలబాలికల తరఫున పనిచేస్తూ వారి జీవితాల్లో మార్పు తీసుకొచ్చిన వారై ఉండాలని తెలిపారు. అర్హులైన వారు http://awards.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

కులగణన తర్వాతే 'స్థానిక' నోటిఫికేషన్ ఇవ్వాలి

కాశీబుగ్గ సెంటర్ : రాష్ట్ర ప్రభుత్వం బీసీ కుల గణన చేసి, పంచాయతీరాజ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ రిజర్వేషన్లను 50శాతానికి పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆమేరకు గురువారం హనుమకొండలోని కార్యాలయంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా ముదిరాజ్‌ల రిజర్వేషన్ అంశాన్ని స్థానిక ఎన్నికలలోపే పరిష్కరించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో స్థానిక సంస్థల రిజర్వేషన్లను 22 శాతం నుంచి 42శాతానికి పెంచుతామని పేర్కొన్నారని, స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి పలు సభలు, సమావేశాల్లో ఈ విషయాన్ని ప్రస్తావించారని గుర్తు చేశారు. ముదిరాజ్‌లకు ఇచ్చిన మాట ప్రకారం రిజర్వేషన్ అంశం పరిష్కారం కాకుంటే రానున్న కాలంలో అన్ని ముదిరాజ్ సంఘాలను కలుపుకుని మెపా ఆధ్వర్యంలో రిజర్వేషన్ సాధనకు ఉద్యమిస్తామని తెలిపారు.

శ్రీరాములు త్యాగనిరతి మరువలేనిది



నివాళులర్పిస్తున్న నాయకులు

హన్మకొండ: సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) నాయకుడు బోగా శ్రీరాములు (మాధవన్న) త్యాగ నిరతిని ప్రతీ కార్యకర్త అలవర్చుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గడ్డం సదానందం, జిల్లా కార్యదర్శి చిర్ర సూరి సూచించారు. హనుమకొండలోని బస్టాండ్ కూడలిలో శ్రీరాములు చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి గురువారం నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మాధవన్న పట్టుదల, క్రమశిక్షణ కలిగి ఉండేవారని గుర్తుచేశారు. భూమి, భుక్తి, దేశ ప్రజల విముక్తి కోసం, నూతన ప్రజాస్వామ్యం కోసం బలమైన విప్లవ ప్రజా ఉద్యమాన్ని నిర్మించారని కొనియాడారు. అహర్నిశలు శ్రమించి తమ సర్వస్వాన్ని త్యాగం చేశారని, ఆయన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో అర్షం అశోక్, కె.శివ, మైదం పాణి పాల్గొన్నారు.

మహిళల హక్కుల పరిరక్షణకు 'సఖి'



సదస్సులో మాట్లాడుతున్న వినీల

కాజీపేట: మహిళలు, బాలికలకు రక్షణ కల్పించడంతో పాటు వారి హక్కులను కాపాడటం కోసం సఖి వన్ స్టాప్ కేంద్రం అంకితభావంతో పని చేస్తోందని కేస్ వర్కర్ వి.వినీల అన్నారు. కాజీపేట 63వ డివిజన్ విష్ణుపురి వాటర్ ట్యాంక్ ప్రాంతంలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలు సంయుక్తంగా మహిళా అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై కుటుంబ సభ్యులతో పాటు బయటి వ్యక్తులు చేసే అన్ని రకాల వేధింపుల నివారణకు సఖి కేంద్రం కృషి చేస్తోందని వివరించారు. బాధిత మహిళలు, బాలికలు టోల్‌ఫ్రీ నంబర్ 181, 0870 – 2452112 నంబర్లకు ఫోన్ చేసి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో సరితతో పాటు స్థానిక మహిళలు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

ఖిలా వరంగల్: సనాతన ధర్మం ప్రపంచానికి అందించిన గొప్ప కానుక యోగా అని, యోగా సాధనతో మానసిక ఒత్తిడి దూరమై సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని యోగా గురువు అశోక్ ఆర్య అన్నారు. వరంగల్ శంభునిపేటలోని హనుమాన్ ఆలయ ప్రాంగణంలో బాల సంస్కార్, హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస శిక్షణ శిబిరం గురువారం జరిగింది. ముఖ్యఅతిథుగా స్థానిక కార్పొరేటర్లు గుండు చందన, పోశాల పద్మ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి యోగా శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం యోగా గురువు అశోక్ మాట్లాడుతూ యోగా సాధనతో అనేక వ్యాధులు దరిచేరవని వివరించారు. అనంతరం మహిళలతో యోగా, ప్రాణాయామం చేయించారు. కార్యక్రమంలో దేవులపల్లి శ్రీలత, రమాదేవి, సంధ్య, నాగలక్ష్మి, రాధిక, సంధ్య, దేవలత, మహిళలు పాల్గొన్నారు.



యోగా సాధన చేయిస్తున్న అశోక్

పీఆర్‌సీ అమలు చేయాలి



కాశీబుగ్గ సెంటర్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 51 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ అమలు చేయాలని పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన సంఘం నాయకులతో కలిసి పీఆర్‌సీ కమిషన్ బాధ్యులను కలిశారు. ఆయన వెంట పీఆర్‌టీయూ రాష్ట్ర బాధ్యులు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, పార్వతి సత్యనారాయణ, జిల్లా బాధ్యులు కోలెపాక సంగీత, కొండ్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

మెరిట్ విద్యార్థులకు ఘన సన్మానం

రామన్నపేట: వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థులను సంఘం ప్రతినిధులు గురువారం సన్మానించారు. వరంగల్ నగరంలోని గోపాలస్వామి దేవాలయంలో విద్యార్థులకు మెమెంటోలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ అనేక మంది ఆర్యవైశ్య విద్యార్థులు ప్రతిభ ఉన్నప్పటికీ రిజర్వేషన్ల కారణంగా ఉద్యోగాల్లో వెనుకబడి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులను ప్రోత్సహించడం కోసమే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం వాసవి మాత పరపతి సంఘం అధ్యక్షులు అకినపల్లి సత్యనారాయణ, బెజగం రజనీకాంత్, వెలగందుల రమేష్, కుంచం వీరభద్రరావు, మున్సిపల్ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ తోట నవీన్ పాల్గొన్నారు.



విద్యార్థులను సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

పోగొట్టుకున్న బ్యాగు అప్పగింత



బ్యాగును అప్పగిస్తున్న ఇన్‌స్పెక్టర్ మల్లయ్య

ఖిలా వరంగల్: బెల్లంపల్లికి చెందిన దుర్గం రాధ తమ కుటుంబ సభ్యులతో కలిసి ఖిలా వరంగల్ కోటను గురువారం సందర్శించారు. సాయంత్రం తిరుగు పయనంలో తన హ్యాండ్ బ్యాగ్ మరిచి వెళ్లిపోయింది. అనంతరం తన బ్యాగ్ కనిపించపోవడంతో మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ మల్లయ్య ఆదేశాలతో ఎస్సై గోవర్ధన్, హెడ్ కానిస్టేబుల్ సాంబయ్య ఏకశిల పార్కులో తనిఖీ చేసి ఆ బ్యాగును గుర్తించారు. అనంతరంతో హ్యాండ్ బ్యాగుతో పాటు బ్యాగ్‌లోని రూ.6వేల నగదు, బయోమెట్రిక్ మిషన్, విలువైన పత్రాలను ఇన్‌స్పెక్టర్ మల్లయ్య చేతుల మీదుగా బాధితురాలు రాధకు అందజేశారు.

'ఆర్డీఓపై చర్య తీసుకోవాలి'

విద్యారణ్యపురి: ఎన్నికల విధుల్లో పాల్గొన్న వారందరికీ ఒకే విధమైన రెమ్యునరేషన్ చెల్లించాలని నారాయణ ఖేడ్‌లో నిరసన తెలిపిన ఉపాధ్యాయులపై పోలీసుల లాఠీచార్జ్ చేయటానికి కారణమైన ఆర్డీఓపై వెంటనే చర్య తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.రవీందర్ రాజు, జిల్లా జనరల్ సెక్రటరీ పెండెం రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యయప్రయాసాలకు ఓర్చి ఎన్నికల విధులు నిర్వర్తిస్తే లాఠీచార్జ్ చేయించడం అమానుషమన్నారు.

రేపు కన్యకా పరమేశ్వరి శోభాయాత్ర



మాట్లాడుతున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

వరంగల్ చౌరస్తా: వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా ఈనెల 18న నిర్వహించనున్న శోభాయాత్రను విజయవంతం చేయాలని ఆర్యవైశ్య రాష్ట్ర సంఘం నాయకులు గందె నవీన్, ఆర్యవైశ్య మిత్ర బృందం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు దుబ్బా శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. వరంగల్ పిన్నావారి వీధిలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. శనివారం సాయంత్రం 5గంటలకు వరంగల్ స్టేషన్ రోడ్డులోని పోచమ్మ దేవాలయం వద్ద ప్రారంభమై చౌరస్తా, జేపీఎన్ రోడ్డు, పిన్నావారి వీధి, ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్, బట్టల బజారులోని వాసవి దేవాలయం వరకు శోభాయాత్ర జరుగుతుందని వివరించారు. అనంతరం అన్నప్రసాద వితరణ, తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సమావేశంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు దాచేపల్లి సీతారాం, చొల్లేటి కళావతి, శిరీషా, పరమేశ్వరి, గుండా సంతోష్, పాల మురళి పాల్గొన్నారు.

ఆ అధికారి అవినీతిపై విచారణ జరపాలి

హన్మకొండ అర్బన్: జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అవినీతి, అక్రమాలపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్ డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమకొండ, జనగామ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ప్రేమకళ మూడేళ్ల నుంచి గిరిజన సంక్షేమ శాఖను భ్రష్టు పట్టించారని పేర్కొన్నారు. అక్రమార్జనే ధ్యేయంగా హనుమకొండ జిల్లాలో పనిచేస్తున్న ఒక్కొక్క వార్డెన్లకు రెండు, మూడు హాస్టళ్ల ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ ప్రతినెలా డైట్ బిల్లుల్లో 20 శాతం తీసుకొని అక్రమంగా లక్షలాది రూపాయలు అర్జిస్తున్నారని తెలిపారు. అలాగే కొంత మంది వార్డెన్లు, ప్రిన్సిపాళ్లను డీటీడీఓ ఆఫీస్‌లో ఖాళీగా కూర్చోబెట్టి జీతాలు చెల్లిస్తున్నారని, ఈ అంశాలపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు బానోతు గోవింద్‌నాయక్, గుగులోతు రమేష్‌నాయక్, భాస్కర్ నాయక్, మోహన్ నాయక్, వెంకన్న నాయక్, గణేష్ నాయక్ పాల్గొన్నారు.



వినతి పత్రంతో అజ్మీరా వెంకట్

మిర్చిబండి వద్ద ఇరువురు ఘర్షణ

ఖిలా వరంగల్: వరంగల్ చింతల్ బ్రిడ్జి వద్ద ఓ మిర్చి బండి వద్ద సమీప బంధువులైన ఇజ్జగిరి రవికిరణ్, ఓరుగంట కోటేశ్వర్ ఘర్షణ పడ్డారు. పరస్పరం దుర్భాషలాడుతూ దాడులు చేసుకుంటారు. అనంతరం ఒకరిపై ఒకరు మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోగా పోలీసులు కేసులు నమోదు చేశారు.

బధిరుల పాఠశాలలో అడ్మిషన్లకు దరఖాస్తులు

హన్మకొండ అర్బన్: తిరుమల, తిరుమతి దేవస్థానం ఆధ్వర్యంలో నగరంలోని ప్రగతినగర్ కాలనీ ఫేజ్ –2లో నిర్వహిస్తున్న శ్రీవెంకటేశ్వర బధిరుల ఉన్నత పాఠశాలలో 2024 – 2025వ సంవత్సరానికి 1నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అడ్మిషన్లు పొందుటకు జూన్ 12వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జె.లక్ష్మీ నరసమ్మ గురువారం తెలిపారు. ఆసక్తి గల తల్లిదండ్రులు తమ వికలాంగ పిల్లల సదరం సర్టిఫికెట్, పుట్టిన తేదీ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్, కులం, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, 4 పాస్ ఫొటోలను దరఖాస్తు ఫారంతో జతచేసి అందజేయాలని సూచించారు. ప్రవేశం పొందిన విద్యార్థులకు 1నుంచి 10వ తరగతి వరకు ఉచిత హాస్టల్ వసతి, బోధన కల్పించనున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకు 62815 75810, 94407 39423 నంబర్లలో లేదా హనుమకొండ ఎన్ఐటీ సమీపంలోని శ్రీవెంకటేశ్వర బధిరుల ఉన్నత పాఠశాలను సంప్రదించవచ్చని ఆమె తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మీ నరసమ్మ

వేసవి శిక్షణకు చేయూత

హసన్‌పర్తి: హసన్‌పర్తిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి బాక్సింగ్ శిక్షణ శిబిరానికి కాయిత నిరంజన్‌రెడ్డి చేయూతనిచ్చారు. ఈమేరకు బాక్సింగ్ పంచింగ్ బ్యాగ్, రెండు జతల పంచింగ్ గ్లోస్‌లు అందించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ మాట్లాడుతూ ఉచిత వేసవి శిక్షణ శిబిరానికి దాతలు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. క్రీడాకారులకు చేయూతనిచ్చిన దాత నిరంజన్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో బాక్సింగ్ కోచ్ శీలం పార్థసారధి, స్థానికులు యాదగిరిరెడ్డి, పి.స్వామి, చుక్క బాబు, వెంకన్న, రమేష్, వంశీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శివకుమార్

ధాన్యానికి బోనస్ ఇవ్వాలి

హసన్‌పర్తి: అధికారంలోకి వస్తే వరి ధాన్యానికి బోనస్ ఇస్తామని పేర్కొన్న విధంగా కాంగ్రెస్ పార్టీ మాటను తప్పొద్దని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మారపల్లి రాంచంద్రారెడ్డి సూచించారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో ఆయన విలేకరులతో గురువారం మాట్లాడారు. రైతులు పండించిన సన్న, దొడ్డు, మధ్య రకం అనే తేడా లేకుండా వరి ధాన్యానికి బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సన్న రకానికి బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని విమర్శించారు. సన్నరకం పండించాలని పేర్కొనడం సరికాదని, ఆ వరి ధాన్యం వాతావరణాన్ని తట్టుకోలేదన్నారు. ఒకవేళ పండించిన వరికి అనేక రకాల వ్యాధులు, రోగాలు వస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.500 బోనస్ మందులకే సరిపోదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. పదేళ్లల్లో కేసీఆర్ చేసిన తప్పులను నాలుగు నెలల్లోనే రేవంత్ రెడ్డి పునరావృతం చేస్తున్నారని అన్నారు.